పాఠం 13

# 17, 18వ శతాబ్దాలలో ప్రజాస్వామిక, జాతీయవాద విప్లవాలు

## ఇంగ్లాండ్– మహోన్నత విప్లవం

యూరపులోని ఇతర దేశాలలాగానే ఇంగ్లాండు కూడా 17వ శతాబ్ద ఆరంభంలో రాజులు, రాణులతో పాలింపబడేది. బ్రిటన్‌లోని అన్ని ప్రాంతాలను (ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్‌లాండ్, ఐర్లాండ్) ట్యూడర్ వంశపు రాజులు ఏకీకృతం చేశారు. రోమన్ కాథలిక్ చర్చికి అధిపతియైన పోప్ అధికారాన్ని అంగీకరించటానికి ట్యూడర్ రాజులు తిరస్కరించారు. బ్రిటిష్ జాతీయతావాదానికి ఇది ఆరంభం వంటిది. బ్రిటిషు ప్రజలు ఒక ప్రత్యేకత కలిగిన వాళ్లని, రోమన్ కాథలిక్ చర్చి, పోప్‌నుంచి వాళ్లకి స్వయం ప్రతిపత్తి ఉండాలని భావించారు. అయితే కొంతకాలానికే రాజ్యంలో అత్యున్నత అధికారం ఎవరికి ఉండాలనే అంశంపై పార్లమెంటుకీ, రాజుకీ మధ్య ఘర్షణ మొదలయ్యింది. పార్లమెంటుకి ప్రతినిధులను భూస్వాములు, వ్యాపారస్తులు ఎన్నుకునేవారు. రాజు ఏ రకమైన పన్ను విధించాలనుకున్నా ఈ పార్లమెంటు ఆమోదం కావాలి. ఈ వైరుధ్యం బ్రిటన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఎలా దారితీసిందో తెలుసుకుందాం.



చార్లెస్ I

1603లో స్టువర్ట్ వంశానికి చెందిన జేమ్స్ I ఇంగ్లాండుకి రాజు అయ్యాడు. తనను ప్రశ్నించటానికి పార్లమెంటుకి ఉన్న అధికారాలతో అతడు విభేదించాడు. రాజుకి ఉండే సర్వాధికారాలు దేవుడినుంచి లభించాయని, ఈ దైవదత్త హక్కుతో రాజులు పరిపాలిస్తున్నారని, కాబట్టి వాళ్లని పార్లమెంటు ప్రశ్నించకూడదని అతడు నమ్మాడు. అతని తరవాత రాజు అయిన చార్లెస్ I పార్లమెంటును రద్దు పరిచి, అది లేకుండా 11 సంవత్సరాలపాటు పాలించాడు. అయితే కొన్ని యుద్ధాలు చేపట్టటానికి అతడికి పార్లమెంటు ప్రత్యేక నిధులు కేటాయించవలసి ఉండటంతో 1640లో పార్లమెంటును అతడు సమావేశపరచక తప్పలేదు. 1640 నుంచి 1660 వరకు కొనసాగిన ఈ పార్లమెంటు (అందుకే దీనిని సుదీర్ఘ పార్లమెంటు అంటారు) రాజు, అతని మంత్రుల నియంతృత్వాన్ని నియంత్రించటానికి ప్రయత్నించింది. చార్లెస్ Iకి చెందిన మంత్రులను, అధికారులను ఈ సుదీర్ఘ పార్లమెంటు శిక్షించింది. చార్లెస్ I ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులను అది రద్దు చేసింది. పార్లమెంటులోని విభేదాలను ఆసరాగా చేసుకుని తన ప్రత్యర్థులను ఖైదు చేయటానికి చార్లెస్ I ప్రయత్నించాడు. పార్లమెంటరీ పార్టీ, రాజు పార్టీ మధ్య అంతర్యుద్ధం మొదలయ్యి అయిదేళ్లపాటు కొనసాగింది. అంతిమంగా 1649లో చార్లెస్ I ఓడించబడి, ఉరితీయబడ్డాడు. ఇంగ్లాండు గణతంత్ర దేశమయ్యింది. అయితే ఈ గణతంత్ర ప్రభుత్వ ప్రయోగం ఎక్కువకాలం కొనసాగలేదు. దాంతో 1688లో ఆరెంజ్‌కి చెందిన విలియంని అతడి భార్య మేరీని

**పౌరయుద్ధం:** ఒక దేశంలో జరిగే అంతర్యుద్ధం


© SCERT not to be republished

(చార్లెస్ I మనవరాలు) ఇంగ్లాండు సింహాసనాన్ని అధిష్టించాల్సిందిగా పార్లమెంటు కోరింది. అనంతరం ఒక కొత్త విధానాన్ని రూపొందించారు. దీని ప్రకారం మంత్రులు పార్లమెంటుకి జవాబుదారీగా ఉంటారు. రాజు అధికారాలను పరిమితం చేశారు. పార్లమెంటుకు సర్వోన్నత అధికారాన్ని ఇచ్చి ప్రజాస్వామ్యానికి దారి వేశారు. రాజు అధికారం దైవదత్తం అయినది కాక పార్లమెంటు ఇచ్చినదిగా ఉంటుంది. అత్యున్నత అధికారాన్ని పార్లమెంటుకి బదిలీ చేశారు. ఈ మార్పులన్నీ ఒక్క తుపాకీగుండు పేలకుండా, ఒక్క రక్తంబొట్టు చిందకుండా జరిగాయి. అందుకే ఈ మార్పుని **'మహోన్నత', లేక 'రక్తరహిత విప్లవం'** అంటారు.

భూమి, ఆస్తులు ఉన్నవాళ్లు మాత్రమే పార్లమెంటుకి జరిగే ఎన్నికల్లో ఓటు వేయవచ్చని ఇంతకు ముందు మీరు చదివారు. వివిధ ప్రాంతాలలోని పార్లమెంటు స్థానాలను జనాభా ప్రకారం కేటాయించలేదు. ఫలితంగా తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల నుంచి ఎక్కువ స్థానాలు ఉన్నాయి. ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాలకు అసలు స్థానమే లేదు. ఓటు హక్కుకోసం, వ్యవస్థలో మార్పుల కోసం ఇంగ్లాండు సాధారణ ప్రజలు ఉద్యమించటం మొదలుపెట్టారు. 1832లో మరింత మందికి ఓటు హక్కు కల్పించి, కొన్ని అసమానతలను తొలగించారు. జనాభాలోని వివిధ వర్గాలకు క్రమంగా ఓటు హక్కు కల్పిస్తూ వచ్చారు. చివరికి 1928 నాటికి వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించారు. ఆ విధంగా ఇంగ్లాండులో పార్లమెంటరీ ప్రభుత్వం పలు దశలలో రూపు దిద్దుకుంది.

- మన నేపథ్యంలో రాజుల పార్టీ, పార్లమెంటరీ పార్టీల వ్యక్తుల మధ్య జరిగే సంభాషణను ఊహించి రాయండి.
- పౌరయుద్ధం వల్ల ఇంగ్లాండు ప్రజలపై, రాజుపై ఎటువంటి ప్రభావం పడింది?

## అమెరికా స్వాతంత్ర్యం 1774-1789


థామస్ జెఫర్‌సన్

ఉత్తర అమెరికా తూర్పు తీరంలో ఇంగ్లాండు వలస ప్రాంతాలను ఏర్పాటు చేసుకుంది. అక్కడ ఆ విధంగా 13 వలస రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇంగ్లాండు నుంచి వ్యవసాయం, చిన్న కర్మాగారాలు, వ్యాపారం కోసం అమెరికా వచ్చి స్థిరపడినవాళ్లతో ఇవి ఏర్పడ్డాయి. అమెరికాలోని రాష్ట్రాలకు సైతం చట్టాలను చేసే అధికారం ఇంగ్లాండులోని పార్లమెంటు తీసుకుంది. అయితే అక్కడి ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసేవాళ్లు కాదు. వలస రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఇంగ్లీషు వ్యాపారస్తులు, కర్మాగారాలకు లాభం కలిగించే చట్టాలను పార్లమెంటు తరచు చేస్తుండేది. దాంతో అమెరికా వలస ప్రాంతాలు **'ప్రాతినిధ్యం లేకుండా పన్ను చెల్లింపు లేదు'** అన్న నినాదాన్ని లేవదీశారు! 1774లో జార్జియా మినహాయించి మిగిలిన వలస రాష్ట్రాల ప్రతినిధులందరూ ఫిలడెల్ఫియాలో సమావేశమయ్యారు. వలస రాష్ట్రాలకు అంతకు ముందున్న అధికారాలను పునరుద్ధరించవలసిందిగా రాజైన మూడవ జార్జికి విన్నవించారు. వలస ప్రాంతాలను అణచివేయటానికి రాజు ప్రయత్నించటంతో బ్రిటిషు, అమెరికా సైనికుల మధ్య సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. శాంతియుత

**గణతంత్రం:** రాజ్యాధినేతగా రాజుకాక, ప్రజాస్వామికంగా ఎన్నుకున్న అధ్యక్షుడు ఉండే వ్యవస్థ

©SCERT to be republished



చిత్రం 13.1: మొదటి చిత్రాన్ని 'కొలంబియా' అంటారు. అమెరికాకి గుర్తుగా దీని బదులు స్వేచ్ఛా స్థూపాన్ని గుర్తించారు.

పరిష్కారానికి రెండవ కాంగ్రెసు కూడా ప్రయత్నించింది. తమ ఆమోదం లేకుండా పన్నులు విధించవద్దని రాజుకి విన్నవించారు. రాజు దీనిని తిరుగుబాటుగా పరిగణించి 1775 ఏప్రిల్‌లో యుద్ధం ప్రకటించాడు. ఫ్రాన్స్ సైనిక సహాయంతో అంతిమంగా 1781 అక్టోబరులో అమెరికా ప్రజలు ఈ యుద్ధంలో విజయం సాధించారు. పారిస్ ఒప్పందం (1783) పై సంతకం చేయటంతో స్వాతంత్ర్య యుద్ధం ముగిసింది. ఈ ఒప్పందం ప్రకారం 13 వలస రాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని బ్రిటన్ గుర్తించింది.

1776 జులై 4న ఫిలడెల్ఫియాలో జరిగిన మూడవ కాంగ్రెసు సమావేశంలో థామస్ జెఫర్‌సన్ రూపొందించిన స్వాతంత్ర్య ప్రకటనను ఆమోదించారు. ఈ ప్రకటన మానవులందరూ సమానులుగా సృష్టింపబడ్డారని, సృష్టికర్త ప్రతి ఒక్కరికీ జీవించేహక్కు, స్వేచ్ఛ, ఆనందాన్ని అన్వేషించే హక్కులు వంటి కొన్ని హక్కులను ఇచ్చాడని పేర్కొంది. 1789లో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం గణతంత్ర రాజ్యాంగాన్ని ఆమోదించింది. జెఫర్‌సన్ ప్రయత్నాలతో రాష్ట్రాల, సమాఖ్య ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన జరిగింది. వాక్ స్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యాలకు సమన్యాయ పాలనలకు హామీ ఇచ్చే హక్కుల చట్టాన్ని చేశారు. దీనితో అమెరికా సంయుక్త రాష్ట్రాల (యుఎస్ఏ) స్థాపన జరిగింది.

© SCERT not to be republished




**ఫ్రెంచి సమాజంలోని ఎస్టేటులు**
*మూడవ ఎస్టేటులో కొంతమంది ధనికులు, కొంతమంది పేదలుగా ఉన్నారని గమనించండి.*

## ఫ్రెంచి విప్లవం

1774లో ఫ్రాన్స్‌లో లూయీ XVI రాజు అయ్యాడు. అతడి వయస్సు 20 సంవత్సరాలు. అతని భార్య ఆస్ట్రియా రాకుమారి అయిన మేరి అంటోనెట్. అతడు రాజు అయిన సమయానికి ఖజానా ఖాళీగా ఉంది. దీర్ఘకాల యుద్ధాల కారణంగా ఫ్రాన్స్ ఆర్థిక వనరులు తగ్గిపోయాయి. దీనికితోడు వెర్సయిల్స్‌లోని అతి పెద్ద రాజభవన నిర్వహణ ఖర్చు భారీగా ఉండేది. లూయీ XVI పాలనలోని ఫ్రాన్స్ తమ ఉమ్మడి శత్రువైన బ్రిటన్ నుంచి అమెరికా వలస ప్రాంతాలు స్వాతంత్ర్యం పొందటంలో సహాయం చేసింది. ఈ యుద్ధం కారణంగా ఫ్రాన్స్ అప్పు మరింత పెరిగిపోయింది. సైన్య నిర్వహణ, న్యాయ వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు వంటి వాటికి అయ్యే ఖర్చుల కోసం ప్రభుత్వానికి పన్నులు పెంచక తప్పింది కాదు. అయితే ఈ చర్య కూడా సరిపోయేది కాదు. 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ సమాజం మూడు ఎస్టేటులుగా విభజింపబడి ఉంది. మూడవ ఎస్టేటు ప్రజలు మాత్రమే పన్నులు చెల్లించే వాళ్లు. మధ్యయుగాలనుంచి కొనసాగుతూ వస్తున్న ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా ఈ ఎస్టేటుల సమాజం ఏర్పడింది.

ఫ్రెంచి సమాజంలో ఎస్టేటులు ఎలా ఏర్పడ్డాయో పక్క పేజీలో చార్ట్ చూపిస్తుంది. దేశ జనాభాలో 90 శాతం వరకు రైతాంగమే. అయితే వాళ్లలో చాలా కొద్దిమంది మాత్రమే తాము సాగుచేసే భూమికి యజమానులుగా ఉన్నారు. భూమిలో 60 శాతం సంపన్నులు, చర్చి, మూడవ ఎస్టేటులోని ధనిక ప్రజల అధీనంలో ఉండేది. మొదటి రెండు ఎస్టేటుల సభ్యులు అంటే మతాధిపతులు, కులీన వర్గాల వాళ్లు పుట్టుకతోనే కొన్ని ప్రత్యేక హక్కులను పొందే వాళ్లు. వీటిల్లో అన్నిటికంటే ముఖ్యమైనది ప్రభుత్వానికి పన్నులు కట్టటం నుంచి మినహాయింపు. కులీన వర్గాలకు మరికొన్ని ఫ్యూడల్ హక్కులు ఉండేవి. దీంట్లో రైతాంగం నుంచి వసూలుచేసే ఫ్యూడల్ పన్నులు ఒకటి. ప్రభువుకి వాళ్ల ఇంట్లో, పొలాల్లో రైతాంగం పనులు చేసి పెట్టాలి. అలాగే సైన్యంలో పనిచేయాలి. రోడ్ల నిర్మాణం వంటి వాటిల్లో పాల్గొనాలి.

చర్చి కూడా రైతాంగం నుంచి తనవంతుగా కొన్ని పన్నులను వసూలు చేసేది. వీటిని 'టైద్' (దశాంశం) అనే వాళ్లు. మూడవ ఎస్టేటు ప్రజలందరూ ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి. వీటిల్లో 'టెయిల్లే' అనే ప్రత్యక్ష పన్ను. రోజువారీ ఉపయోగించే ఉప్పు, పొగాకు వంటివాటిపై అనేక పరోక్ష పన్నులు ఉండేవి. ప్రభుత్వ నిర్వహణకు అయ్యే ఖర్చును పన్నుల ద్వారా సమకూర్చే బరువును మూడవ ఎస్టేటు ఒక్కటే మోసేది. పంటలు విఫలమైన సంవత్సరాలలో పేదల కష్టాలు మరింత తీవ్రతరమయ్యేవి.


### కొత్త పదాలు

| | |
|---|---|
| **లివర్‌లు** | – ఫ్రాన్స్‌లో ద్రవ్య కొలమానం (కరెన్సీ). *1794 నుంచి నిలిపివేయబడినది.* |
| **మతాధిపతులు** | – చర్చిలో ప్రత్యేక విధులతో సంబంధం ఉన్న వ్యక్తుల బృందం |
| **టైద్** | – చర్చి విధించిన పన్ను. దీని ప్రకారం వ్యవసాయ ఉత్పత్తిలో పదవ వంతు చర్చికి చెల్లించాలి |
| **టెయిలే** | – ప్రభుత్వానికి నేరుగా కట్టే పన్ను |

© SCERT not to be republished

- కింద ఉన్న పటంలోని ఖాళీ డబ్బాలను వీటినుంచి అనువైన పదంతో నింపండి:

**ఆహారం కోసం అల్లర్లు, ఆహారధాన్యాల కొరత, మరణాల సంఖ్య పెరగటం, పెరుగుతున్న ఆహార ధరలు, చిక్కిన శరీరాలు**



## పెరుగుతున్న మధ్య తరగతి : సంపన్న వర్గాల హక్కులకు చరమగీతం

పెరుగుతున్న పన్నులు, ఆహార కొరతకు వ్యతిరేకంగా గతంలో కూడా రైతాంగం, కార్మికులు తిరుగుబాటులలో పాల్గొన్నారు. అయితే సామాజిక, ఆర్థిక వ్యవస్థలో పూర్తి స్థాయి మార్పు తీసుకురాగల కార్యక్రమంగానీ, చర్యలుగానీ వాళ్ల వద్ద లేవు. ఈ బాధ్యత విద్య, కొత్త భావనలు ఉన్న మూడవ ఎస్టేటులోని సంపన్న వర్గాలపై పడింది.

18వ శతాబ్దంలో కొత్త సామాజిక బృందాలు ఏర్పడ్డాయి. వీటన్నిటిని కలిపి మధ్య తరగతిగా వ్యవహరించటం మొదలుపెట్టారు. పెరుగుతున్న విదేశీ సముద్ర వాణిజ్యం, ఉన్ని, పట్టు వస్త్రాల తయారీ వంటి వాటి ద్వారా వీళ్లు సంపన్నులయ్యారు. వ్యాపారస్తులు, వస్తు ఉత్పత్తిదారులే కాకుండా మూడవ ఎస్టేటులో న్యాయవాదులు, పాలన యంత్రాంగ అధికారులు, వృత్తినిపుణులు కూడా ఉండేవాళ్లు. వీళ్లందరూ విద్యావంతులు. సమాజంలో ఏ బృందమూ పుట్టుకతో ప్రత్యేక హోదా, హక్కులు కలిగి ఉండకూడదని వీళ్లు నమ్మేవాళ్లు. ఒక వ్యక్తి ప్రతిభను బట్టి వాళ్ల సామాజిక హోదా నిర్ణయింపబడాలి. జాన్ లాక్, జీన్ జాక్వెస్ రూసో వంటి తత్వవేత్తలు అందరికీ స్వాతంత్ర్యం, సమాన చట్టాలు, సమాన అవకాశాల ఆధారంగా ఏర్పడిన సమాజాన్ని కలలు కన్నారు. తన 'Two Treatises of Government' అన్న వ్యాసంలో లాక్ రాచరికపు దైవదత్త, సంపూర్ణ హక్కును ఖండించటానికి ప్రయత్నించాడు. ఈ భావనను రూసో ముందుకు తీసుకెళ్లి ప్రజలు, వాళ్ల ప్రతినిధుల మధ్య సామాజిక ఒప్పందంపై ఆధారపడిన ప్రభుత్వాన్ని ప్రతిపాదించాడు. 'The Spirit of Laws' అనే గ్రంథంలో ప్రభుత్వంలో విధాన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల మధ్య అధికార విభజనను మాంటెస్క్యూ ప్రతిపాదించాడు. ఈ రకమైన ప్రభుత్వ విధానాన్ని బ్రిటన్‌నుంచి స్వాతంత్ర్యం పొందిన అమెరికాలోని 13 రాష్ట్రాలు అమలులో పెట్టాయి. అమెరికా రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత హక్కులకు హామీ ఇవ్వడం అనేవి ఫ్రాన్స్‌లోని రాజకీయ మేధావులకు ఆదర్శంగా నిలిచాయి.

ఈ తత్వవేత్తల ఆలోచనలు, అభిప్రాయాలను గోష్టులలో, దుకాణాలలో తీవ్రంగా చర్చించేవాళ్లు. పుస్తకాలు, వార్తాపత్రికల ద్వారా ఈ అభిప్రాయాలకు విస్తృత ప్రచారం లభించింది. చదవటం, రాయటం రానివాళ్లకోసమని వీటిని తరచు పైకి చదివి వినిపించేవాళ్లు. ప్రభుత్వ ఖర్చులను భరించటానికి లూయీ XVI మరిన్ని పన్నులు విధించబోతున్నాడన్న వార్త తెలిసి ప్రత్యేక హక్కులపై నిరసన, కోపం తీవ్రస్థాయిని చేరుకున్నాయి.

## పెల్లుబికిన విప్లవం

పైన పేర్కొన్న కారణాల వల్ల లూయీ XVI పన్నులు పెంచవలసి వచ్చిందని తెలుసుకున్నాం. దీనిని ఎలా అమలులోకి తెచ్చి ఉంటాడు? ఫ్రాన్స్‌లోని పురాతన పాలనలో రాజుకి తన ఒక్కడి ఇష్టం ప్రకారం పన్నులు విధించే అధికారం లేదు. ఎస్టేట్స్ జనరల్‌ని సమావేశపరిచి కొత్త పన్నులకు దాని ఆమోదాన్ని రాజు పొందాలి. ఎస్టేట్స్ జనరల్ శాసనసభ వంటిది, దీనికి మూడు ఎస్టేటుల నుంచి ప్రతినిధులు ఉండే వాళ్లు. అయితే ఈ సభను ఎప్పుడు సమావేశపరచాలో రాజు మాత్రమే నిర్ణయిస్తాడు. ఈ సభ ఆఖరి సమావేశం 1614లో జరిగింది.



*చిత్రం 13.2: 1789 మే 5న వెర్సయిల్స్ వద్ద ఎస్టేట్స్ జనరల్ సమావేశ ప్రారంభోత్సవం*



*చిత్రం 13.3: టెన్నిస్ కోర్టు ప్రతిజ్ఞ*
*జాతీయ శాసనసభలో పెడదామనుకున్న జాక్వెస్-లూయీ డేవిడ్ వేసిన పెద్ద పేయింటింగ్*

1789 మే 5న కొత్త పన్నుల ప్రతిపాదనను ఆమోదించటానికి లూయీ XVI ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరిచాడు. ప్రతినిధుల సమావేశం కోసం వెర్సయిల్స్ మందిరాన్ని తీర్చిదిద్దారు. మొదటి, రెండవ ఎస్టేట్‌లు ఒక్కొక్కటి 300 ప్రతినిధులను పంపించాయి. వీళ్లు రెండువైపులా ఎదురుఎదురుగా కూర్చున్నారు. మూడవ ఎస్టేటుకి చెందిన 600 ప్రతినిధులు వెనక నిలబడవలసి వచ్చింది. మూడవ ఎస్టేటులో సంపన్నులు, విద్యావంతులైన వాళ్లకే ప్రాతినిధ్యం దక్కింది. రైతాంగం, చేతివృత్తి కళాకారులు, మహిళలకు శాసనసభలో ప్రవేశాన్ని తిరస్కరించారు. అయితే వాళ్ల సమస్యలు, కోరికలను 40,000 ఉత్తరాల రూపంలో వాళ్ల ప్రతినిధులు తీసుకుని వచ్చారు.

అప్పటివరకు ఎస్టేట్స్ జనరల్‌లో ఒక్కొక్క ఎస్టేటుకి ఒక ఓటు చొప్పున ఓటింగు జరిగేది. ఇదే ఆచారాన్ని కొనసాగించాలన్న కృతనిశ్చయంతో లూయీ XVI ఉన్నాడు. అయితే శాసనసభ మొత్తం ఓటు వేయాలని, ప్రతి సభ్యునికి ఒక ఓటు ఉండాలని మూడవ ఎస్టేటు సభ్యులు పట్టు పట్టారు. 'The Social Contract' అన్న పుస్తకంలో రూసో దీనిని ప్రతిపాదించాడు. ఇతర తత్వవేత్తలు కూడా ప్రతిపాదించిన ప్రజాస్వామిక సూత్రాలలో ఇది ఒకటి. ఈ ప్రతిపాదనను రాజు తిరస్కరించటంతో మూడవ ఎస్టేటు సభ్యులు తమ నిరసన తెలియచేయటానికి బయటకు వెళ్లిపోయారు.

మూడవ ఎస్టేటు ప్రతినిధులు తమను తాము ఫ్రెంచి దేశమంతటికి ప్రతినిధులుగా భావించసాగారు. వెర్సయిల్స్‌లోని టెన్నిస్ కోర్టు మైదానంలో జూన్ 20న వీళ్లందరూ సమావేశమయ్యారు. వాళ్లు తమను తాము జాతీయ శాసన సభగా ప్రకటించుకుని రాజు అధికారాలను పరిమితం చేసే ఫ్రెంచి రాజ్యాంగాన్ని తయారు చేసేదాకా తాము విడిపోమని ప్రతినబూనారు.


ఈ జాతీయ శాసనసభ వెర్సయిల్స్ రాజ్యాంగ రూపకల్పనలో తలమునకలై ఉండగా మిగిలిన ఫ్రెంచి దేశం అతలాకుతలం అవుతోంది. తీవ్ర చలి వల్ల పంటలు బాగా పండలేదు. దాంతో రొట్టెల ధర పెరిగిపోయింది. ఈ పరిస్థితిని ఉపయోగించుకుని లాభపడటానికి రొట్టె తయారీదారులు సరుకును నిల్వ చేయసాగారు. దుకాణాల ముందు గంటలకొద్దీ వేచి ఉండటంతో కోపోద్రిక్తలకులోనైన మహిళలు దుకాణాల్లోకి దూసుకు వెళ్లారు. అదే సమయంలో సైన్యాన్ని పారిస్‌లో సమాయత్తం కావలసిందిగా రాజు ఆదేశించాడు. ఆందోళనకు దిగిన ప్రజలు జులై 14న బాస్టిల్ కారాగారంపై దాడి చేసి దానిని బద్దలుకొట్టారు. నిరంకుశ రాచరిక హక్కులకు ప్రతీకగా ఈ కారాగారాన్ని ప్రజలు ద్వేషించారు. ఈలోగా పల్లెల్లో ప్రభువులు

కోతకి వచ్చిన పంటలను నాశనం చేయటానికి దోపిడీ దొంగల ముఠాలను కిరాయికి కుదుర్చుకున్నారని, వాళ్లు ఊళ్లమీద పడబోతున్నారని పుకార్లు వ్యాపించాయి. భయంతో పెచ్చరిల్లిపోయిన రైతాంగం అనేక జిల్లాల్లో కత్తులు, పలుగులు తీసుకుని ఛాటూల మీద దాడి చేశారు. అక్కడ ఆహార నిల్వలను దోచుకున్నారు. ప్రభువులకు చెల్లించాల్సిన అప్పుల వివరాలకు సంబంధించిన పత్రాలను తగలబెట్టారు. కులీనవర్గానికి చెందిన అనేక మంది తమ ఇళ్లు వదిలి పారిపోయారు. అందులో చాలామంది విదేశాలకు వలస వెళ్లారు. తన ప్రజల తిరుగుబాటును చూసిన లూయీ XVI చివరికి జాతీయ శాసనసభను గుర్తిస్తున్నట్లు ప్రకటించాడు. అప్పటినుంచి తన అధికారాలను రాజ్యాంగం పరిమితం చేస్తుందన్న సూత్రానికి అతను ఒప్పుకున్నాడు. 1789 ఆగస్టు 4న పన్నులు, వెట్టిచాకిరికి సంబంధించిన ఫ్యూడల్ వ్యవస్థను రద్దుచేస్తూ శాసనసభ ఆదేశాలను జారీ చేసింది. మతగురువులు కూడా తమ ప్రత్యేక హోదాను వదులుకోక తప్పింది కాదు. టిథేను రద్దు చేసి చర్చి అధీనంలో ఉన్న భూములను జప్తు చేశారు. దీంతో ప్రభుత్వానికి కనీసం 200 కోట్ల లివర్ల విలువ చేసే ఆస్తులు సమకూరాయి.

**మానర్:** ప్రభువు భూములు, అతడి ఇల్లు ఉన్న ప్రాంతం
**ఛాటూ:** రాజు లేదా కులీనవ్యక్తికి చెందిన కోట లేదా ప్రాసాదం

## రాజ్యాంగబద్ధ రాచరికంగా ఫ్రాన్స్ పరిణామం

జాతీయ శాసనసభ 1791లో రాజ్యాంగ ముసాయిదా ప్రతిని తయారు చేసింది. దీని ప్రధాన ఉద్దేశం రాచరిక అధికారాలను పరిమితం చేయటం. ఈ అన్ని అధికారాలు ఒకే వ్యక్తి దగ్గర ఉండటానికి బదులు శాసనసభ, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల మధ్య విభజింపబడ్డాయి. దీని వల్ల ఫ్రాన్స్ రాజ్యాంగబద్ధ రాచరిక దేశంగా మారింది.




*1791 నాటి ఫ్రెంచి రాజ్యాంగం ప్రకారం పరిపాలనా వ్యవస్థ*

ప్రక్క చిత్రం కొత్త రాజకీయ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలియచేస్తుంది. 1791 రాజ్యాంగం, చట్టాలను చేసే అధికారాన్ని జాతీయ శాసనసభకి ఇచ్చింది. ఇది పరోక్షంగా ఎన్నికయ్యే సభ. అంటే ఎన్నుకునేవాళ్ల సమూహాన్ని పౌరులు ఎన్నుకోగా ఈ సమూహం శాసనసభని ఎన్నుకుంటుంది. అయితే పౌరులందరికీ ఓటుహక్కు లేదు. 25 సంవత్సరాల వయసు పైబడి కనీసం మూడు రోజుల కూలీ అంత పన్ను చెల్లిస్తున్న

©SCERT not to be republished

పురుషులకు మాత్రమే క్రియాశీలక పౌరుల హోదాను ఇచ్చారు. అంటే ఓటువేసే హక్కు వీళ్లకు మాత్రమే ఉంది. మిగిలిన పురుషులను, స్త్రీలందరినీ ప్రేక్షక పౌరులుగా వర్గీకరించారు. ఎన్నుకునేవాళ్లుగా ఉండటానికి, వాళ్లనుంచి శాసనసభ సభ్యునిగా ఎన్నికవ్వటానికి అధిక మొత్తంలో పన్ను చెల్లిస్తున్న వాళ్ల జాబితాలో ఉన్నవారే అర్హులు.

పురుషులు, పౌరుల హక్కుల ప్రకటనతో రాజ్యాంగం మొదలయ్యింది. జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర్యం, అభిప్రాయ స్వాతంత్ర్యం, చట్టం ముందు అందరూ సమానులు వంటి హక్కులను 'సహజ, విడదీయరాని' హక్కులుగా చేశారు. దీని అర్థం ఈ హక్కులు ప్రతి ఒక్కరికీ పుట్టుకతో సంక్రమిస్తాయి. వీటిని ఎవరూ తీసేసుకోలేరు. పౌరుల సహజ హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత.

ఆ తరవాత సంవత్సరాలలో కూడా ఫ్రాన్స్‌లోని పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. లూయీ XVI రాజ్యాంగం మీద సంతకం చేసినప్పటికీ అతడు ప్రష్యా రాజుతో రహస్యంగా మంతనాలు చేపట్టాడు. ఇతర పొరుగు

© SCERT not to be republished

### మానవ పౌర హక్కుల ప్రకటన



1. మానవులు స్వేచ్ఛాజీవులుగా పుట్టారు. అలాగే ఉంటారు. హక్కులు అందరికీ సమానంగా వర్తిస్తాయి.
2. మనిషి సహజ, విడదీయరాని హక్కులైన స్వేచ్ఛ, ఆస్తి, భద్రత, అణచివేతలకు ప్రతిఘటన ప్రతి రాజకీయ సంఘ ఉద్దేశం కావాలి.
3. సార్వభౌమత్వ మూలాలు దేశంలో ఉంటాయి. ప్రజల నుంచి సంక్రమించని అధికారాన్ని ఏ వ్యక్తి, బృందం కలిగి ఉండకూడదు.
4. స్వేచ్ఛ అంటే ఇతరులకు హాని కలిగించని ఏదైనా చేసే అధికారం.
5. సమాజానికి హాని కలిగించే చర్యలను మాత్రమే నిషేధించే అధికారం చట్టానికుంటుంది.
6. చట్టం ప్రజల అభీష్టాన్ని వ్యక్తపరుస్తుంది. దాని తయారీలో పౌరులందరూ ప్రత్యక్షంగా కానీ, లేదా తమ ప్రతినిధుల ద్వారాగాని పాల్గొనవచ్చు. దానిముందు పౌరులందరూ సమానమే.
7. చట్టం నిర్ణయించిన సందర్భాలలో మినహాయించి ఏ వ్యక్తి నిందింపబడకూడదు. బంధింపబడకూడదు.
11. ప్రతి పౌరునికి స్వేచ్ఛగా మాట్లాడే, రాసే, ప్రచురించే హక్కు ఉంది. చట్టం నిర్ణయించిన ప్రకారం ఇటువంటి స్వేచ్ఛను దుర్వినియోగ పరచినందుకు అతడు బాధ్యత వహించాలి.
12. పరిపాలన వ్యవస్థ ఖర్చులకు, ప్రజాసైన్యాన్ని నిర్వహించటానికి అందరికి వర్తించే పన్నులు విధించటం తప్పనిసరి. వాళ్లకున్న ఆస్తుల నిష్పత్తిలో వీటిని పౌరులందరికీ వర్తింప చేయాలి.
17. ఆస్తి పవిత్రమైన, ఉల్లంఘించగూడని హక్కు కాబట్టి చట్టబద్ధంగా నిర్ణయించిన ప్రజా ప్రయోజనాలకు అవసరమైనప్పుడు తప్పించి దానిని తీసుకోకూడదు. అటువంటి సందర్భాలలో న్యాయమైన నష్ట పరిహారాన్ని ముందుగా చెల్లించాలి.

*(**గమనిక:** ముఖ్యమైన హక్కులు మాత్రమే ఇచ్చాం)*

దేశాల పాలకులు కూడా ఫ్రాన్స్‌లోని పరిణామాలతో ఆందోళన చెందారు. 1789 వేసవి తరవాత జరిగిన ఘటనలను అణగదొక్కెయ్యటానికి తమ సైన్యాలను పంపించటానికి వాళ్లు సిద్ధంగా ఉన్నారు. ఇది జరిగే లోపలే 1792 ఏప్రిల్‌లో జాతీయ శాసనసభ ప్రష్యా, ఆస్ట్రియాలపై యుద్ధం ప్రకటించింది. సైన్యంలో చేరటానికి వివిధ ప్రాంతాలనుంచి వేలాది సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వాళ్లు దీనిని యూరపు అంతటిలోని రాచరికాలు, రాజులకు వ్యతిరేకంగా ప్రజల యుద్ధంగా చూశారు.

- పౌరులకు 1791 రాజ్యాంగం ఇచ్చిన రాజకీయ హక్కులను (చూడండి – పేజీ 160లోని బాక్స్) హక్కుల ప్రకటనలోని 1 నుంచి 6 అధికరణాలను పోల్చండి. రెండు పత్రాలలో సారూప్యత ఉందా? రెండూ ఒకే భావనను తెలియ చేస్తున్నాయా?
- (160 పేజీలోని చార్టుని చూడండి) 1791 రాజ్యాంగంలో ఫ్రెంచ్ సమాజంలో ఏ వర్గప్రజలు లాభపడి ఉంటారు? ఏ వర్గాలు అసంతృప్తి చెందటానికి అవకాశముంది?
- ఫ్రాన్స్‌లోని ఘటనల ప్రభావం రాచరిక వ్యవస్థలైన ప్రష్యా, ఆస్ట్రియా–హంగరీ, లేదా స్పెయిన్ వంటి పక్క దేశాలపై ఎలా ఉండి ఉంటుంది? ఫ్రాన్స్‌లో జరుగుతున్న దానికి సంబంధించి వస్తున్న వార్తలకు ఆయాదేశాలలోని రాజులు, వ్యాపారస్తులు, రైతాంగం, కులీన వర్గాలు, మతనాయకుల స్పందన ఎలా ఉండి ఉంటుంది?

1791 రాజ్యాంగం సమాజంలోని ధనిక వర్గాలకు మాత్రమే రాజకీయ హక్కులు ఇచ్చింది కాబట్టి విప్లవ పంథా మరింత ముందుకు సాగాలని జనాభాలోని అధిక శాతం ప్రజలు భావించారు. ప్రభుత్వ విధానాలను చర్చించటానికి, తమ కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోటానికి ప్రజలకు రాజకీయ క్లబ్బులు ముఖ్యమైన వేదికలు అయ్యాయి. వీటిల్లో చాలా విజయవంతమైనది జాకొబిన్స్ క్లబ్బులు, పారిస్‌లోని ఒకప్పటి సెంట్ జాకబ్ కాన్వెంటు నుంచి దీనికి ఆ పేరు వచ్చింది.

**కాన్వెంటు:** మతపర జీవితానికి అంకితమైన ప్రజా సమూహానికి చెందిన భవనం.

జాకొబిన్ క్లబ్బులలో సభ్యులు ప్రధానంగా సమాజంలోని పేద ప్రజలనుంచి ఉండే వాళ్లు. చిన్న దుకాణదారులు, చేతి వృత్తుల వాళ్లు, చెప్పులు తయారు చేసేవాళ్లు, వంటలు వండేవాళ్లు, గడియారాలు చేసేవాళ్లతో సహా సేవకులు, రోజువారీ కూలిపని చేసేవాళ్లు ఇందులో ఉండేవాళ్లు. వాళ్ల నాయకుడు మాక్సిమిలియన్ రాబిస్పియర్.

ఆహార పదార్థాల కొరత, వాటి అధిక ధరలతో కోపోద్రిక్తులైన అధిక సంఖ్యాక పారిస్ ప్రజలతో 1792 వేసవిలో జాకొబిన్లు ఒక తిరుగుబాటుకి ప్రణాళిక వేశారు. ఆగస్టు 10 ఉదయం ట్యులెరీస్ మహలు మీదకి దండెత్తి రాజు రక్షకభటులను చంపేసి అనేక గంటలపాటు రాజునే బందీగా ఉంచారు. ఆ తరవాత రాచరిక కుటుంబాన్ని చెరసాలపాలు చేయాలని శాసనసభ తీర్మానించింది. దాంతో ఎన్నికలు జరిగాయి. అప్పటినుంచి సంపదతో సంబంధం లేకుండా 21 సంవత్సరాలు దాటిన పురుషులందరికీ ఓటు హక్కు లభించింది.

కొత్తగా ఎన్నికైన శాసనసభను కన్వెన్షన్ అని పిలవసాగారు. 1792 సెప్టెంబరు 21న అది రాచరికాన్ని రద్దు చేసి ఫ్రాన్స్‌ని గణతంత్రంగా ప్రకటించింది. గణతంత్రం అంటే ప్రభుత్వ అధినేతతో సహా ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటారు. కుట్ర ఆరోపణపై 1793లో లూయీ XVI, రాణి మేరి ఆంటోయినెట్‌లకు మరణశిక్ష విధించారు.

© SCERT not to be republished

## భీతావహ పాలన

1793-1794 మధ్యకాలాన్ని భీతావహ పాలనగా పేర్కొంటారు. తీవ్ర నియంత్రణ, శిక్షల విధానాన్ని రాబిస్పియర్ అనుసరించాడు. రిపబ్లిక్‌కి 'శత్రువులు'గా అతడు భావించిన వాళ్లందరినీ – ఒకప్పటి కులీనులు, మతగురువులు, ఇతర రాజకీయ పార్టీల సభ్యులు, అతడి పద్ధతులతో ఏకీభవించని అతని పార్టీ సభ్యులను సైతం అరెస్టుచేసి, జైలుకి పంపించి విప్లవ ట్రిబ్యునల్ ద్వారా విచారించేవాళ్లు. వాళ్లు 'దోషులు'గా న్యాయస్థానం నిర్ణయిస్తే గిల్లెటిన్ ద్వారా చంపేసే వాళ్లు. వేతనాలు, ధరల మీద కూడా పరిమితి విధిస్తూ రాబిస్పియర్ ప్రభుత్వం చట్టాలు చేసింది. మాంసం, రొట్టెలకు రేషను విధించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పట్టణాలకు రవాణా చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మేలా నిర్బంధించేవారు. ఖరీదైన తెల్ల పిండి (మైదా) వాడటాన్ని నిషేధించారు. ప్రజలందరూ మొత్తం గోధుమ పిండితో చేసిన రొట్టెలను మాత్రమే తినాలి. చర్చిలను మూసివేసి వాటి భవనాలను సైన్యానికి, ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చివేశారు. రాబిస్పియర్ తన విధానాలను ఎంత తీవ్రంగా అమలు చేసేవాడంటే అతడి సహచరులే కొంత సంయమనం పాటించాలని కోరసాగారు. చివరికి అతడు 1794 జులైలో న్యాయస్థానం ద్వారా దోషిగా తేల్చబడ్డాడు. వెంటనే అతడిని అరెస్టు చేసి ఆ మరునాడే గిల్లెటిన్ ద్వారా చంపేశారు.

**గిల్లెటిన్:** పైనుంచి జారే కత్తి ద్వారా మనిషి మెడనరికి చంపేసే పద్ధతి.

## ఫ్రాన్స్‌లో డైరెక్టరీ పరిపాలన

జాకొబిన్ ప్రభుత్వం పడిపోవటంతో సంపన్న, మధ్యతరగతివర్గం అధికారాన్ని చేజిక్కించుకుంది. సమాజంలో ఆస్తిలేని వర్గాలకు ఓటుహక్కు లేకుండా చేసిన కొత్త రాజ్యాంగాన్ని చేశారు. ఎన్నికైన రెండు శాసనసభ సంఘాలకు ఇది అవకాశం కల్పించింది. ఇవి అయిదుగురు సభ్యులతో కూడిన కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకుంటాయి, దీనినే డైరెక్టరీ అంటారు. జాకొబిన్ ప్రభుత్వంలో మాదిరి అధికారం ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతం కాకుండా చూడటానికి ఈ విధానాన్ని చేపట్టారు. అయితే డైరెక్టరీ తరచు శాసనసభ సంఘాలతో ఘర్షణ పడుతూ ఉండేవాళ్లు. దాంతో అవి వాళ్లని తొలగించేవి. సంచాలక బృంద విధానంలోని రాజకీయ అస్థిరత్వం నెపోలియన్ బోనపార్టి సైనిక నియంతగా ఎదగడానికి దారి తీసింది. అంతిమంగా అతడు అధికారం చేజిక్కించుకున్నాడు. తనను తాను ఫ్రాన్స్‌కి చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. ఫ్రెంచి విప్లవం మోసగింపబడిందని అనేక ప్రజాస్వామికవాదులు భావించారు.

ప్రభుత్వ రూపాలు మారుతున్నప్పటికీ ఫ్రాన్స్, మిగిలిన యూరపులో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆదర్శాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. తరవాత శతాబ్దంలోని రాజకీయ ఉద్యమాలకు ఈ ఆదర్శాలు ప్రేరణను ఇచ్చాయి.

## ఫ్రెంచి విప్లవంలో మహిళలు

ఫ్రెంచి సమాజంలో ముఖ్యమైన మార్పులు తెచ్చిన అన్ని ఘటనలలో మహిళలు మొదటినుంచి క్రియాశీలకంగా పాల్గొన్నారు. వీటిల్లో తాము భాగస్వాములు కావటంద్వారా తమ జీవితాలను మెరుగుపరిచే చర్యలు ప్రవేశపెట్టేలా విప్లవ ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావచ్చని వాళ్లు ఆశించారు. మూడవ ఎస్టేటులోని అధిక శాతం మహిళలు జీవనోపాధికోసం శ్రమించాల్సి వచ్చేది. బట్టలు కుట్టటం,



© SCERT not to be republished

ఉతకటం వంటి పనులు చేసేవాళ్లు. బజారులో పూలు, పళ్లు, కూరగాయలు అమ్మేవాళ్లు లేదా ధనికుల ఇళ్లల్లో పనులు చేసేవాళ్లు. అధిక శాతం మహిళలకు చదువు, ఉపాధికి శిక్షణ అందుబాటులో ఉండేవి కావు. కులీన, మూడవ ఎస్టేటు సంపన్న వర్గాల కూతుళ్లను మాత్రమే కాన్వెంటులో చదివించేవాళ్లు. ఆ తరవాత వాళ్లకు పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసేవాళ్లు. శ్రామిక మహిళలు తమ కుటుంబ బాధ్యత కూడా వహించాల్సి వచ్చేది – అంటే పిల్లల సంరక్షణ, వంట, నీళ్లు తేవటం, రొట్టెకోసం బారులలో నిలబడటం వంటి పనులు చేసేవాళ్లు. పురుషుల కంటే మహిళల వేతనాలు తక్కువగా ఉండేవి.

తమ సమస్యల గురించి చర్చించటానికి, తమ గళం వినిపించటానికి మహిళలు తమ సొంత రాజకీయ క్లబ్బులు, వార్తాపత్రికలు ప్రారంభించారు. ఫ్రాన్స్‌లోని వివిధ పట్టణాలలో అరవై దాకా మహిళల క్లబ్బులు ఏర్పాటయ్యాయి. వాటిల్లో విప్లవ, గణతంత్ర మహిళల సంఘం బాగా ప్రఖ్యాతి గాంచింది. పురుషులకు ఉన్న రాజకీయ హక్కులు మహిళలకు కూడా ఉండాలన్నది వాళ్ల ప్రధాన కోరికలలో ఒకటి. 1791 రాజ్యాంగం తమను ప్రేక్షక పౌరులుగా చేయటంతో మహిళలు నిరాశకు లోనయ్యారు. ఓటుహక్కు, శాసనసభకు పోటీచేసే హక్కు, రాజకీయ పదవి చేపట్టే హక్కు కావాలని వాళ్లు పోరాటాలు చేపట్టారు.

విప్లవ ప్రభుత్వం తొలి సంవత్సరాలలో మహిళల జీవితాలను మెరుగుపరిచే చట్టాలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయటంతో పాటు ఆడపిల్లలకు చదువు తప్పనిసరి చేశారు. వాళ్ల ఇష్టానికి వ్యతిరేకంగా వాళ్లకి పెళ్లి చేసేహక్కు తల్లిదండ్రుల నుండి తీసేశారు. వివాహం అనేది పౌరచట్టం కింద నమోదు చేసుకునే స్వేచ్ఛాయుత ఒప్పందంగా పరిగణింపబడసాగింది. విడాకులను చట్టబద్ధం చేశారు. వాటి కోసం పురుషులు, స్త్రీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలు ఇప్పుడు ఉద్యోగాలకోసం శిక్షణ పొందవచ్చు. కళాకారులు కావచ్చు. చిన్న వ్యాపారాలు నడపవచ్చు.

సమాన రాజకీయ హక్కుల కోసం మహిళల ఉద్యమం కొనసాగింది. 'భీతావహపాలన' కాలంలో మహిళల క్లబ్బులు మూసివేస్తూ, వాళ్ల రాజకీయ కార్యకలాపాలను నిషేధిస్తూ కొత్త ప్రభుత్వం చట్టాలు చేసింది. అనేకమంది ప్రముఖ మహిళలను చెరసాలపాలు చేశారు. మరణశిక్ష విధించారు. ఆ తరవాత ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో రెండు శతాబ్దాలపాటు మహిళలకు ఓటుహక్కు కోసం, సమాన వేతనాల కోసం పోరాటాలు కొనసాగాయి. 19వ శతాబ్దపు చివర, 20వ శతాబ్ద ఆరంభంలో సార్వజనీన ఓటుహక్కు ఉద్యమంలో భాగంగా మహిళల ఓటుకోసం ఉద్యమం కొనసాగింది. విప్లవకాలంలో ఫ్రెంచి మహిళల రాజకీయ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఈనాటికీ నిలిచిపోయాయి. ఫ్రాన్స్ మహిళలకు అంతిమంగా 1946లో ఓటుహక్కు లభించింది.



*చిత్రం 13.4: వెర్సయిల్స్‌కి వెళుతున్న పారిస్ మహిళలు. 1789 అక్టోబరు 5న మహిళలు వెర్సయిల్స్‌కి వెళ్లి రాజును తమతోపాటు పారిస్‌కి తీసుకొచ్చారు. ఈ బొమ్మ అనేక రాజకీయ వినతిపత్రాలపై ముద్రింపబడింది.*

© SCERT not to be republished

## కీలక పదాలు

1. మహోన్నత విప్లవం
2. దైవదత్త హక్కు
3. కులీనవర్గ పాలన
4. రాచరికం
5. డైరెక్టరి
6. సౌభ్రాతృత్వం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింద పేర్కొన్న వాక్యాలు ఏ దేశానికి సంబంధించినవో గుర్తించండి: (బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్)
   - విప్లవం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థ నెలకొల్పబడింది.
   - విప్లవం తరవాత కూడా రాజుకి పాలనలో కొంత పాత్ర ఉన్న దేశం.
   - ప్రజాస్వామ్యాన్ని స్థాపించటానికి మరొక దేశంతో యుద్ధం చేయవలసి వచ్చిన దేశం.
   - హక్కుల చట్టాన్ని ఆమోదించారు.
   - రాచరికాన్ని కూలదోయటానికి రైతాంగం నాయకత్వం వహించింది.
   - మానవ పౌర హక్కుల ప్రకటనను ఆమోదించారు.
2. కొత్త రూపాలలో ప్రభుత్వాలు ఏర్పడటం వెనక సామాజిక మేధావుల ప్రధాన ఆలోచనలు ఏమిటి? అవి ప్రజాదరణను ఎలా పొందాయి?
3. ఫ్రాన్స్‌లో విప్లవ తిరుగుబాటులకు దారి తీసిన పరిస్థితులను వివరించండి.
4. విప్లవం వల్ల ఫ్రెంచి సమాజంలో ఏ వర్గాలు ప్రయోజనం పొందాయి? ఏ బృందాలు అధికారాన్ని వదులుకోవలసి వచ్చింది? విప్లవానంతర పరిణామాల వల్ల ఏ సామాజిక వర్గాలు నిరాశకు గురై ఉంటాయి?
5. ప్రాథమిక హక్కుల అధ్యాయం పూర్తిచేసిన తరవాత ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ఏ ప్రజాస్వామిక హక్కుల మూలాలు ఫ్రెంచి విప్లవంలో ఉన్నాయో జాబితా తయారుచేయండి.
6. సార్వజనీన హక్కుల ప్రకటన వైరుధ్యాలతో కూడుకుని ఉందన్న అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? వివరించండి.
7. 'ప్రాతినిధ్యం లేకుండా పన్నులు లేవు' అన్న నినాదాన్ని అమెరికా వలస రాష్ట్రాలు లేవనెత్తటానికి కారణాలు ఏమిటి?
8. మధ్య తరగతి అంటే మీరు ఏమి అర్థం చేసుకున్నారు? అది యూరపులో ఎలా ఏర్పడింది?
9. యూరపు పటంలో ఇంగ్లాండు, ఫ్రాన్స్, ప్రష్యా, స్పెయిన్, ఆస్ట్రియాలను గుర్తించండి.
10. ఫ్రెంచి విప్లవం నందు మహిళలు నిర్వహించిన పాత్రను ఎలా అర్థం చేసుకోవచ్చు.

## ప్రాజెక్టు

అమెరికా, ఫ్రెంచి విప్లవాలలో ప్రముఖ పాత్ర పోషించిన వ్యక్తుల గురించి మరిన్ని వివరాలు సేకరించండి. వాళ్లలో మీకు ఎవరు ఎక్కువగా నచ్చారు, ఎందుకు? ఆ వ్యక్తిపై ఒక పేరా రాయండి.

© SCERT not to be republished